## నేడు ఉచిత గ్రహణ మొర్రి పరీక్షలు

ప్రజాశక్తి-రాయచోటి

బసవతారకం స్మైల్ ట్రైన్ సెంటర్-బసవతారకం ఇండో అమెరికన్ కేన్సర్ ఆస్పత్రి సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో కడప నగరంలోని భవిత సెంటర్లో సోమవారం ఉదయం 9 గంటల నుంచి ఒంటిగంట వరకు ఉచిత గ్రహణ మొర్రి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఐఇ కో-ఆర్డినేటర్ కె. జనార్ధన ఒకప్రకటనలో తెలిపారు. పరీక్షలు డాక్టర్ ముకుంద రెడ్డి ఆధ్వర్యంలో ఉచిత గ్రహణ మొర్రి స్క్రీనింగ్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. 6 నెలల వయస్సు నుంచి 50 సంవత్సరాలు వారు శిబిరానికి హాజరు కావాలని తెలిపారు. గ్రహణ మొర్రి ఆపరేషన్ జరిగిన వారు, గ్రహణ మొర్రి ఆపరేషన్ చేసుకొని వారు కూడా ఈ శిబిరానికి హాజరు కావాలని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని జిల్లాలోని ప్రతి ఒక్కరూ ఉపయోగించుకోవాలని కోరారు.

# రాములోరి కల్యాణానికి వైభవంగా ఏర్పాట్లు

**- టిటిడి ఛైర్మన్ బి.ఆర్.నాయుడు**

ప్రజాశక్తి-ఒంటిమిట్ట

శ్రీ కోదండరామ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏప్రిల్ 11న జరిగే శ్రీ సీతారాముల కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని టిటిడి ఛైర్మన్ బి.ఆర్.నాయుడు తెలిపారు. ఒంటిమిట్టలోని పరిపాలనా భవనంలోని సమావేశ మందిరంలో టిటిడి జెఇఒ వి.వీరబ్రహ్మాం, జిల్లా అధికారులతో ఆదివారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఒంటిమిట్టలో జరిగే శ్రీ సీతారాముల కల్యాణాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారని తెలిపారు. అందుకు తగ్గట్టుగా ఏర్పాట్లు చేపట్టాలని అధికారులకు సూచించారు. టిటిడి అధికారులు, కడప జిల్లా అధికారులు సమన్వయంతో ప్రణాళికా బద్ధంగా, నిర్మాణాత్మకంగా ఏర్పాట్లు చేయాలని కోరారు. భక్తులకు అందరికీ ముత్యాల తలంబ్రాలు, ప్రసాదాలు అందేంచేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి ఏడాది సీతారాముల కళ్యాణానికి భక్తుల సంఖ్య పెరుగుతోందని, భక్తుల తాకిడికి తగ్గట్టుగా సౌకర్యాలు కల్పించాలన్నారు. టిటిడి విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ, పోలీసులు సమన్వయంతో పనిచేయాలన్నారు. శ్రీ సీతారాముల కల్యాణం రోజున ఎలాంటి విద్యుత్ అంతరాయం కలగరాదని, అవసరమైన జనరేటర్లు ఏర్పాటు చేయాలన్నారు. వేసవి నేపథ్యంలో అగ్ని మాపక శాఖ మరింత అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఆహ్వానం పత్రికలు అందరికీ అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. భక్తులకు సేవలు అందించేందుకు అవసరమైన శ్రీవారి సేవకులను ఏర్పాటు చేయాలని, భక్తులను ఆకట్టుకునేలా పుష్పాలంకరణ, విద్యుత్ అలంకరణలు, సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. భక్తులకు తాగునీరు, మజ్జిగ, అన్నప్రసాదాలు విరివిగా పంపిణీ చేయాలని కోరారు. అత్యవసర వైద్య సేవలు, అవసరమైన మందులు నిల్వ ఉంచాలన్నారు. శాఖలవారీగా అధికారులు చేయనున్న పనులను ఛైర్మన్‌కు నివేదించారు. అంతకు ముందు కల్యాణ వేదిక ప్రాంగణాన్ని టిటిడి ఛైర్మన్ అధికారులతో కలిసి పరిశీలించారు. కల్యాణ వేదిక ప్రాంగణాన్ని చక్కని పుష్ప, విద్యుత్ అలంకరణలతో అలంకరించాలని సూచించారు. భక్తుల ప్రవేశం, నిష్క్రమణ మార్గాల్లో పటిష్టంగా భద్రతాపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని వేసవి నేపథ్యం, అనుకోకుండా వర్షం వచ్చినా ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ నెల 15న అమరావతిలో శ్రీనివాస కల్యాణోత్సవం నిర్వహించడానికి ఏర్పాటు చేస్తున్నామన్నారు. సమావేశంలో కడప ఆర్‌డిఒ జాన్ ఇర్విన్, డిఎస్‌పి వేంకటేశ్వర్లు, టిటిడి డిప్యూటీ ఇఒలు నటేష్ బాబు, ప్రశాంతి, గోవింద రాజన్, సెల్వం, ఎస్ ఇలు వేంకటేశ్వర్లు, మనోహర్, అడిషనల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సునీల్ కుమార్, విజిఒ సదాలక్ష్మి, అసిస్టెంట్ జిల్లా ఫైర్ ఆఫీసర్ వి.ఆదినారాయణరెడ్డి, సేల్స్ వింగ్ ప్రత్యేక అధికారి రామరాజు, ఎఇఎస్ఒ వై.సతీష్ కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు

బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను పరిశీలిస్తున్న టిటిడి ఛైర్మన్ బి.ఆర్.నాయుడు, జెఇఒ

**శాస్త్రోక్తంగా మహాసంప్రోక్షణ :** ఒంటిమిట్ట శ్రీకోదండరామస్వామి ఆలయంలో ఆదివారం ఉదయం శాస్త్రోక్తంగా మహాసంప్రోక్షణ నిర్వహించారు. ఉదయం భగవత్పుణ్యాహం, మూర్తి హోమం, శ్రీమద్రామాయణ హోమం, పంచసూక్తం పవమాన హోమాలు నిర్వహించారు. మహా పూర్ణాహుతి, వృషభ లగ్నంలో మహా సంప్రోక్షణ, మహా కుంభాభిషేకము, స్వర్ణ పుష్పార్చన శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం భక్తులను స్వామివారి దర్శనానికి అనుమతించారు.

**బ్రహ్మోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ :** ఒంటిమిట్ట శ్రీకోదండరామ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల పోస్టర్లు, ఆలయ చరిత్ర తెలియజేసే కరపత్రాలను ఆలయంలో టిటిడి ఛైర్మన్ బి.ఆర్.నాయుడు, జెఇఒ వి.వీరబ్రహ్మాంతో కలిసి ఆలయం ముందు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏప్రిల్ 6వ తేదీన శ్రీరామనవమి, పోతన జయంతి, ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయని తెలిపారు. ఏప్రిల్ 9న హనుమంత వాహనం, ఏప్రిల్ 10న గరుడవాహనం, ఏప్రిల్ 11న శ్రీసీతారాముల కల్యాణం, ఏప్రిల్ 12న రథోత్సవం జరుగనున్నాయని తెలిపారు. ఈ ఉత్సవాలకు విస్తృతంగా ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు. భక్తులు విశేష సంఖ్యలో పాల్గొనాలని కోరారు. అనంతరం శ్రీ విశ్వావసు నామ సంవత్సర పంచాంగాన్ని ఆవిష్కరించారు.

# 'పది'లో ఉత్తమ ఫలితాలకు కృషి

**- డిఇఒ సుబ్రమణ్యం**

ముఖా ముఖి..

ప్రజాశక్తి-రాయచోటి

పదో తరగతి పరీక్షల్లో రాష్ట్రంలో అన్నమయ్య జిల్లాలో ఉత్తమ పలితాలు సాధించడానికి కృషి చేస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. రాబోయే పది పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు, ఉత్తీర్ణత శాతాన్ని పెంచడానికి చర్యలు, ప్రణాళికలు, విద్యార్థులు ఎలా చదవాలో, పరీక్షలు ఎలా రాయాలో, విద్యార్థులు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో వంటి వాటి పై ప్రజాశక్తికి ఇచ్చిన ముఖా ముఖిలో ఆయన వివరించారు.

**జిల్లా వ్యాప్తంగా హైస్కూల్ వివరాలు తెలపండి?**

అన్నమయ్య జిల్లాలో మొత్తం 505 ప్రభుత్వ, ప్రయివేటు ఉన్నత పాఠశాలలు కలవు. ఎయిడెడ్ 5, ఎపిఎంఎస్ 17, ఎపిఆర్ఎస్ 8, ఎస్‌హెచ్ ఆర్ఎం 1, బిసి వెల్ఫేర్ 4, ప్రభుత్వ కెజిబివి 22, ఎంపిఎల్ 7, ప్రయివేట్ 198, స్కూల్ వెల్ఫేర్ 11, ట్రైబల్ వెల్ఫేర్ 8, జడ్పీ 214 పాఠశాలలున్నాయి.

**పది పరీక్షల్లో ఎప్పటినుండి ప్రారంభమవుతున్నాయి?**

పదివ తరగతి పరీక్షలు ఈ నెల 17వ తేదీ నుండి ఏప్రిల్ 1వ తేదీ వరకు ఉదయం 9.30 నుండి 12.45 వరకు జరుగుతాయి. మొత్తం 22,355 మంది విద్యార్థులు పరీక్ష రాస్తున్నారు.

**పరీక్ష కేంద్రాలు ఎన్ని ఏర్పాటు చేస్తున్నారు?**

జిల్లాలో మొత్తం 121 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశాం. 121 చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు 1200, ఇన్విజిలేటర్లును ఏర్పాటు చేశాం.

**పరీక్షల షెడ్యూల్ వివరిస్తారా?**

పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ఈ నెల 17 నుండి ఏప్రిల్ 1 వరకు జరగనున్నాయి. సబ్జెక్టుల వారీగా పరీక్షలు 17వ తేదీన మొదటి భాష, 19న రెండవ భాష, 21న ఇంగ్లీష్, 24 గణితం, 26న ఫిజిక్స్, 28 బయాలజీ, 29న వృత్తి విద్యా, ఏప్రిల్ 1న సాంఘిక శాస్త్రంతో ముగుస్తాయి.

**పరీక్ష కేంద్రాల వద్ద ఎటువంటి సౌకర్యాలు కల్పిస్తున్నారు?**

కలెక్టరు శ్రీధర్ చామకూరి ఆదేశాల మేరకు జిల్లా అధికారులకు, జిల్లా విద్య అధికారికి అన్ని పరీక్షా కేంద్రాలలో వైద్య సదుపాయాలను సమకూర్చాలని తెలియజేశాం. ఎపిఎస్ ఆర్టీసీ వారికీ పరీక్ష సమయానుకూలంగా ఆయా రూట్స్‌లో రవాణా సదుపాయం కల్పించాలని చెప్పాం. పోలీస్ అధికారులకు పరీక్ష కేంద్రాలలో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నాం. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుంది. జిరాక్స్ సెంటర్‌లను పరీక్షా సమయంలోమూసివేస్తున్నాం.

**ఉత్తమ ఫలితాలు సాధించడానికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?**

జిల్లా వ్యాప్తంగా పదో తరగతి ఫలితాల్లో మంచి ఉత్తీర్ణత కొరకు 100 రోజుల ప్రణాళికల ద్వార ఉత్తీర్ణత పెంపొందించ డానికి అన్ని చర్యలు తీసుకుంటున్నాం.

**విద్యార్థులకు సలహాలు, సూచనలు ఏమైనా ఇవ్వాలనుకుంటున్నారా?**

విద్యార్థులు టివిలు, సెల్ ఫోన్‌కు దూరంగా ఉండాలి. విద్యార్థులు తల్లిదండ్రులు కూడా ప్రత్యేక శ్రద్ధ చూపాలి. పరీక్ష సెంటర్‌లోకి విద్యార్థులకు 30 నిమిషాలు ముందుగానే హాజరు కావాలి. విద్యార్థులకు ప్రతి సెంటర్లో కావాల్సిన మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేశాం. విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాసి అన్నమయ్య జిల్లాను రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలపడానికి అందరు సహకరించాలి.

# ముగ్గురు విద్యార్థులు అదృశ్యం

**- పోలీసులకు ఫిర్యాదు చేసిన తల్లిదండ్రులు**

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లె పట్టణంలో ముగ్గురు విద్యార్థులు అదృశ్యం కావడంతో తల్లిదండ్రులు పోలీసులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు రెండో పట్టణ పోలీసులు అదృశ్యం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మదనపల్లె పట్టణం, నీరుగట్టువారి పల్లి, సాయిరాం వీధిలో నివాసముంటున్న లేట్ సుబ్రహ్మణ్యం, రాణి దంపతుల కుమారుడు సుమంత్ ఎనిమిదవ తరగతి చదువుతున్నాడు. ఇదే ప్రాంతంలో నివాసముంటున్న అమ్ములు, రామాంజులు దంపతుల కుమారులు రిషి 10వ తరగతి, యశ్వంత్ ఏడవ తరగతి చదువుతున్నారు. ఈ ముగ్గురు విద్యా ర్థులు కలిసి గురువారం చెరువుకు ఈతకు వెళ్తున్నామని ఇంట్లో చెప్పి వెళ్లారు. ఆ తర్వాత తిరిగి ఇంటికి రాలేదు. దీంతో తల్లిదండ్రులు పలుచోట్ల బిడ్డల కోసం గాలించారు. బంధువుల ఇళ్ళ, తెలిసిన వారి ఇళ్ల, పలు బస్టాండ్ లు, రైల్వే స్టేషన్లు, దేవాలయాల వద్ద వెతికారు. ఎక్కడా ఆచూకీ లభ్యం కాకపోవడంతో ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు అదృశ్యం కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల ఆచూకీ తెలిపిన వారు పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

# ఎస్‌టి వర్గీకరణ అమలు చేయాలి

**- యానాదుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు పెంచలయ్య**

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న యానాదుల సంక్షేమ సంఘం నాయకులు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

రాష్ట్రంలో ఎస్‌టిలకు ప్రత్యేక వర్గీకరణ చట్టం ఏర్పాటు చేయాలని రాష్ట్ర యానాదుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కెసి.పెంచలయ్య డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని ఎంపిడిఒ సభాభవనంలో యానాదుల ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు నల్లి బాలకృష్ణ అధ్యక్షతన జరిగిన ఉమ్మడి కడప జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 37 లక్షల గిరిజన జనాభాలో 30 శాతం మంది యానాదులు ఉన్నారని పేర్కొన్నారు. ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా వెనుకబడి ఉన్నారని తెలిపారు. అందుకు ప్రత్యేక వర్గీకరణ అవసరమని పేర్కొన్నారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ జయంతి సందర్భంగా అంబేద్కర్ స్ఫూర్తి, ఆశయాలతో దేశంలో అన్ని వర్గాలకు సమ న్యాయం, సంక్షేమం ఫలాలు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఎస్‌టిల ప్రత్యేక చట్టం వర్గీకరణ సాధించేందుకు ఏప్రిల్ 14న శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా కేంద్రమైన నెల్లూరు జిల్లాలో ఎస్‌టి వర్గీకరణ భేరి సభను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనంతరం ఎస్‌టి వర్గీకరణ భేరిసభకు సంబంధించిన కరపత్రాలు ఆవిష్కరించారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు చేవ్వూరి సుబ్బారావు, మహిళా అధ్యక్షులు ఉష, రవీంద్ర, ఉద్యోగులు మేకల రమణయ్య, నిమ్మళ్ళ వెంకట రమణ, యాకసిరి హరినాథ్, మేకల చెంగయ్య, తలపల మధుసూదన్ రావు, యానాదుల సంక్షేమ సంఘం అన్నమయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి పులి శివశంకర్, యానాదుల సంక్షేమ సంఘం కడప జిల్లా అధ్యక్షులు నీలం సురేంద్ర పాల్గొన్నారు.

# అవని డిపాజిట్ పథకం ఉపయుక్తం : డిసిసిబి ఎజిఎం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

అవని డిపాజిట్ పథకం సీనియర్ సిటిజన్స్‌కు ఎంతో ఉపయుక్తమని, సద్వినియోగం చేసుకోవాలని చిత్తూరు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు లిమిటెడ్ ఎజియం చంద్రకళ తెలిపారు. ఆదివారం స్థానిక జిఆర్‌టి హైస్కూల్‌లో జరిగిన సమావేశంలో ఎజియం మాట్లాడుతూ చిత్తూరు జిల్లా సహకార కేంద్ర బ్యాంకులో సీనియర్ సిటిజన్ మహిళలకు 8.4శాతం వడ్డీ వస్తుందన్నారు. కరపత్రాలు విడుదల చేసి పథకం గురించి అవగాహన కల్పించారు. 333 రోజులకు అవని డిపాజిట్ పథకం 8.30 శాతం వడ్డీతో మహిళలు ఉపయోగించు కోవడానికి ఈనెల 31వ వరకు మాత్రమే అవకాశం ఉందని అన్నారు. ఇందులో కనిష్ట డిపాజిట్ రూ.10 వేలకు పైబడి స్వీకరించబడునని చెప్పారు. మీ డిపాజిట్లకు డిఐసిజిసి ఇన్సూరెన్స్ రక్షణ కలదని వివరించారు. జిల్లా సహకార కేంద్ర బ్యాంకులో పొదుపు చేస్తే వాణిజ్య బ్యాంకుల కంటే అదనపు వడ్డీ పొందవచ్చునని పేర్కొన్నారు. విశ్రాంత బ్యాంక్ మేనేజరును గొల్లపూడి తిరుపతి రావు మాట్లాడుతూ జిల్లా సహకార కేంద్ర బ్యాంకులో డిపాజిట్ చేసి అత్యధిక వడ్డీని పొందవచ్చునని అన్నారు. ముఖ్యంగా అవణి డిపాజిట్ పథకం క్రింద డిపాజిట్ చేయడం వలన సీనియర్ సిటీజన్లు అధిక ప్రయోజనం పొంద వచ్చునని సూచించారు. ఈ అవకాశాన్ని ఆసక్తి వున్న వారందరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బ్యాంక్ సీనియర్ అసిస్టెంట్ వాణి, సీనియర్ సిటీజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, అన్నమయ్య జిల్లా అధ్యక్షులు ఎన్.మునిగోపాలకృష్ణ, రాయల్ యూత్ సొసైటీ వ్యవస్థాపకులు రేగడి ప్రసాద్ కుమార్, ధనలక్ష్మి, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎజియం చంద్రకళ

పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అమర్నాథ్‌రెడ్డి

## యువత పోరును విజయవంతం చేయండి

**-వైసిపి జిల్లా అధ్యక్షులు ఆకేపాటి అమర్నాథ్‌రెడ్డి**

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

కూటమి ప్రభుత్వం ఏర్పడి పది నెలలు కావస్తున్నా ఇంతవరకు ఎలాంటి హామీలు నెరవేర్చకుండా పబ్బం గడుపుతుందని, ఈ నెల 12 వ తేదీన రాయచోటి కలెక్టరేట్ కార్యాలయంలో చేపట్టబోవు యువతపోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విద్యార్థులు, యువతకు వైసిపి జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం వైసిపి కార్యా లయంలో యువతపోరు పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆకేపాటి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం యువతను, విద్యార్థులను మోసం చేసిందని, యువతకు నిరుద్యోగ భృతి ఇస్తానని, విద్యార్థులకు ఫీజులు చెల్లిస్తామని హామీ ఇచ్చి ఇంతవరకు అవి నెరవేర్చకపోవడంతో ఆందోళన చెందుతున్నారని అన్నారు. వారికి మద్దతుగా 12న రాయచోటి కలెక్టరేట్ కార్యాల యంలో జరగ బోయే ర్యాలీని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సి పల్ చైర్మన్ పోలా శ్రీనివాసరెడ్డి, వైస్ చైర్మన్ రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి గాలివీటి వివేక్ రెడ్డి, రాష్ట్ర లీగల్ సెల్ కార్యదర్శి గోవర్ధన్‌రెడ్డి, జిల్లా విద్యార్థి సంఘం అధ్యక్షులు జగంరెడ్డి కిషోర్ కుమార్‌రెడ్డి, జిల్లా యువజన సంఘం అధ్యక్షులు వెలగచర్ల శివకుమార్‌రెడ్డి, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ నరేష్, వాణిజ్యం విభాగం అధ్యక్షులు నవీన్ పాల్గొన్నారు.

## వైసిపి మేధావుల ఫోరం రాష్ట్ర కార్యదర్శిగా విఎస్.రెడ్డి

**ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ :** వైసిపి మేధావుల ఫోరం రాష్ట్ర కార్యదర్శిగా మదనపల్లెకు చెందిన విఎస్.రెడ్డి నియామకమయ్యారు. ఆదివారం పార్టీ అధిష్టానం నియామక ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా వి.ఎస్.రెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి ఈ పదవి అప్పగించిన రాష్ట్ర అధ్యక్షులు, మాజీ సీఎం వై.ఎస్ జగన్మోహన్ రెడ్డి, రాజంపేట పార్లమెంట్ సభ్యులు మిథున్‌రెడ్డి, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిలకు సహకరించిన మదనపల్లె ఇన్‌ఛార్జి నిస్సార్ అహ్మద్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దేశాయ్ తిప్పారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ నరేష్ కుమార్‌రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ వి.మానూజారెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. తనతో పాటు వివిధ విభాగాలలో రాష్ట్ర కార్యదర్శులుగా నియమితులైన రేవతి బీరంగి, చంద్రమౌళిఇ అభినందనలు తెలిపారు. వైసిపి మేధావుల విభాగాన్ని బలోపేతం చేస్తానని, 2029లో పార్టీని అధికారంలోకి తీసుకొచ్చి, జగన్మోహన్ రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని చెప్పారు. వి.ఎస్ రెడ్డికి పలువురు వైసిపి నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు.

## నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

ప్రజాశక్తి-రాయచోటి

అన్నమయ్య కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా కేంద్రంతో పాటు మండల, మున్సిపల్ కార్యాలయాల్లో కూడా కార్యక్రమం ఉంటుందన్నారు. ప్రజల నుంచి వారి సమస్యలను స్వీకరించి, వాటిని పరిష్కరించేందుకు ఉదయం 10 గంటల నుండి అర్జీదారులు తమ విజ్ఞప్తులను సంబంధిత గ్రామ, మండల, డివిజన్లలో అధికారులకు ఇవ్వాలని సూచించారు. మండల, డివిజన్ స్థాయిలో సమస్యలు పరిష్కారం కాని అర్జీదారులే జిల్లా కేంద్రంలో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి రాగలరని తెలిపారు.

## జపాన్ విశ్వవిద్యాలయంతో 'మిట్స్' ఒప్పందం

ప్రజాశక్తి-మదనపల్లె

జపాన్‌లోని ఐజు విశ్వవిద్యాలయంతో మదనపల్లె సమీపంలోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాల అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ విద్యా ప్రయాణంలో పరిశోధన అవకాశాలను మెరుగుపరచడం, విద్యార్థులు, అధ్యాపకులకు ప్రపంచవ్యాప్త బహిర్గతం అందించడం లక్ష్యంగా ఒక ఆశాజనక విద్యా భాగస్వామ్యాన్ని ఏర్పాటు చేసిందని అన్నారు. విద్యార్థులు వివిధ విభాగాలలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ కార్యక్రమాలను పూర్తి చేయడానికి మార్గాలు, విద్యా ఆవిష్కరణలను ప్రోత్సహించడానికి ఉమ్మడి పరిశోధన ప్రాజెక్టులు, క్రాస్-కల్చరల్ లెర్నింగ్ కోసం ఈ అవగాహన ఒప్పందం ముఖ్య ఉదేశమని అన్నారు. ఐజు విశ్వవిద్యాలయంలో ఎగ్జిక్యూటివ్ చైర్‌పర్సన్ సుకహర సునియో ఈ అవగాహన ఒప్పందంపై సంతకం చేసినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ నాదేళ్ల విజయభాస్కర్‌చౌదరి మాట్లాడుతూ ఈ అవగాహన ఒప్పందం మిట్స్ అంతర్జాతీయ ప్రయత్నాలలో ఒక ప్రధాన మైలురాయిని సూచిస్తుందని అన్నారు. ఉన్నత విద్యను కోరుకునే విద్యార్థులకు కొత్త మార్గాలకు జపాన్‌లోని ఈ విశ్వవిద్యాలయం మాకు ఒక మార్గదర్శి అని అన్నారు. ప్రభావవంతమైన విద్యా, పరిశోధన సహకారాలకు ఒక వేదికను ఏర్పాటు చేస్తుందని పేర్కొన్నారు. ప్రపంచ మార్పిడి, వినూత్న పరిశోధన, విద్యా నైపుణ్యానికి మార్గం సుగమం చేయడం లక్ష్యంగా పెట్టుకుందని అన్నారు. కార్యక్రమంలో సీనియర్ మేనేజర్ ఇంటర్నేషనల్ విజయలక్ష్మి పాల్గొన్నారు. తెలిపారు. సీనియర్ అసోసియేట్ ప్రొఫెసర్ టాట్సుకి పాల్గొన్నారు.

ఎంఓయు పత్రాలను అందుకుంటున్న విజయలక్ష్మి

## మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే లక్ష్యం

**- టిడిపి జిల్లా అధ్యక్షులు చమర్తి జగన్‌మోహన్‌రాజు**

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చి దిద్దడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందని రాజంపేట పార్లమెంటు టిడిపి అధ్యక్షులు చమర్తి జగన్ మోహన్‌రాజు పేర్కొన్నారు. ఆదివారం పార్లమెంట్ క్యాంప్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేనేత రంగం ద్వారా మహిళలకు చేయూతనిస్తూ మహిళా ప్రగతికి ప్రతి జిల్లాకు రూ.60లక్షలు కేటాయించారని, రాష్ట్రవ్యాప్తంగా లక్ష మంది మహిళలకు ఉచిత కుట్టు మిషన్లు పంపిణీ చేశారని తెలిపారు. మహిళల కోసం, మహిళల చేత డ్వాక్రా ఉత్పత్తులను రికార్డు స్థాయిలో విక్రయించారని అన్నారు. చిన్న తరహా వ్యాపారాలను మహిళలకు అవగాహన కల్పించేందుకు ప్రభుత్వ ఒప్పందం కుదుర్చుకుని రాపిడుతో మహిళలకు రూ 30 వేల వరకు లబ్ధి చేకూరేలా ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని అన్నారు. మహిళల చేత అరకు కాఫీ అవుట్‌లను ఏర్పాటు చేసి మహిళలను మహారాణులను చేస్తున్నామన్నారు. రూ.17.73 కోట్లతో లక్షకు పైగా అంగన్వాడీ వర్కర్ల గ్రాట్యుటీ అందిస్తున్నామని, ఆశా వర్కర్లకు కూడా గ్రాటిటీ అమలు చేశామన్నారు. విశ్వకర్మ ద్వారా లక్ష రూపాయల రుణం అందించి మహిళలకు ఆర్థికంగా మద్దతుగా నిలిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు గన్నే సుబ్బ నరసయ్య నాయుడు, పట్టణ అధ్యక్షులు దగ్గుబాటి సుబ్రహ్మణ్యం నాయుడు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి ఇడిమడకల కుమార్, మాజీ మండల అధ్యక్షుడు కోవ్వూరు సుబ్రహ్మణ్యం నాయుడు, టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేవూరి వేణుగోపాల్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జగన్‌మోహన్‌రాజు

## నెరవేరిన జ్యూస్ ఫ్యాక్టరీ కార్మికుల కల

**- ఇళ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే షాజహాన్‌బాషా భూమిపూజ**

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లి గ్రామీణ మండలం వలసపల్లి పంచాయతీలో ఉన్న జ్యూస్ ఫ్యాక్టరీ కార్మికుల కల 15 ఏళ్ల తరువాత నెరవేరింది. ఫ్యాక్టరీ యాజమాన్యం ప్రభుత్వ నిబంధనలకు లోబడి ఇళ్ల స్థలాలను మంజూరు చేసింది. భూ అక్రమణదారుల చర్యలతో, గత పాలకుల నిర్లక్ష్యం లబ్ధి దారులు ఇల్లు నిర్మాణం చేపట్టేందుకు అవాంతరాలు ఏర్పడుతూనే వచ్చాయని కార్మికులు పేర్కొ న్నారు. ఎమ్మెల్యే షాజహాన్‌బాషా లబ్ధిదారుల ఇంటి స్థలాల విషయమై ఉన్న చిన్న పాటి అవాం తరాలను తొలగిస్తూ సమస్యను పరిష్కరించారని పేర్కొన్నారు. ఆదివారం ఎమ్మెల్యే షాజ హాన్‌బాషా కార్మికుల ఇళ్ల నిర్మాణాలకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 253 కార్మిక కుటుంబాలకు 15 ఎళ్ల క్రితమే ఇళ్ల పట్టాలు మంజూరయ్యాయని అన్నారు. 15 ఏళ్లుగా ఇళ్లు నిర్మించుకోవడానికి ఇబ్బందులు ఎదురు కావడంతో తీవ్ర కాలయాపన జరిగిందని తెలిపారు. అధికారులతో మాట్లాడి లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకునేందుకు అనుమతులు ఇప్పించినట్లు తెలి పారు. సొంతింటి కల నెరవేరడంతో కార్మికులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కత్తి లక్ష్మన్న, వెంకటరమణ, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## రాయచోటిలో 144 సెక్షన్ అమలు

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

రాయచోటిలో తలెత్తిన మతపరమైన సమస్య కారణంగా శాంతిభద్రతల పరిరక్ష ణలో భాగంగా ఈ నెల 9 నుంచి 30వ తేదీ వరకు 22 రోజుల పాటు పట్టణంలో 144 సెక్షన్ ఆంక్షలు అమలు చేస్తున్నట్లు ఆదివారం అర్బన్ సిఐ పి.చంద్రశేఖర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాయచోటి పట్టణ పరిధిలో 144 ఆంక్షలు అమల్లో ఉంటాయని అన్నారు. మతపరమైన సమావేశాలు చేయకూడదని, ఆర్టికల్ 51ఎ ప్రకారం ప్రతి పౌరుని ప్రాథమిక కర్తవ్యం కాబట్టి మతాన్ని దెబ్బతీసే ఎలాంటి సమావేశాలు ఊరేగింపులు చేయకూడదని అన్నారు. భయాందోళనను సృష్టించే పుకార్లను ఎవరు వ్యాప్తి చేయకూడదని, నలుగురు, అంతకు మించి వ్యక్తులు బహిరంగ ప్రదేశాల్లో గుమిగూడవద్దని, కర్రలు, ఇతర మారణాయుధాలతో సంచరించవద్దని సూచించారు. ఎవరైనా అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. **మదనపల్లె అర్బన్ :** మదనపల్లె డివిజన్ పరిధిలో సోమవారం 144 సెక్షన్ అమలులో ఉన్నట్లు డిఎస్‌పి కొండయ్య నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ సూచనలతో ఆదివారం రాత్రి నుంచి సోమవారం రాత్రి వరకు మదనపల్లి పట్టణంలో 30 పోలీస్ యాక్ట్ తో పాటు, 144 సెక్షన్ కూడా అమలులో ఉంటుందన్నారు. వీధుల్లో మతపరమైన ర్యాలీలు, సమావేశాలు ధర్నాలపై ఆంక్షలు ఉంటాయని అన్నారు. కేవలం భక్తులు వారి ఇళ్లలో, ప్రార్థనా మందిరాల్లో మాత్రమే పూజలు, ప్రార్థనలు చేసుకోవచ్చునన్నారు. ఈ ఆంక్షలు ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డిఎస్‌పి హెచ్చరించారు. ప్రజలు, భక్తులు నిబంధనలు పాటిస్తూ పోలీసులకు సహకరించాలన్నారు.

కరపత్రాలను ఆవిష్కరిస్తున్న శివయ్య, నాయకులు

## 23న రాయలసీమ మాలల సింహ గర్జన

**ప్రజాశక్తి-నిమ్మనపల్లె**

ఎస్‌సి వర్గీకరణకు క్రిమిలేయర్‌ను వ్యతిరేకిస్తూ మార్చి 23న తిరుపతిలో జరిగే మాలల సింహగర్జన సభ విజయవంతం చేయాలని జిల్లా మాల మహానాడు అధ్యక్షులు చింతపర్తి శివయ్య, సహాయ కార్యదర్శి వీరనాల మాణిక్యం పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని అగ్రహారం, నల్లగొండ, కొత్తపల్లి, బండమీద మాలపల్లి గ్రామాలలో హలో మాల- చలో తిరుపతి కరపత్రాలను ఆవిష్కరించారు. మాలలందరు రాయలసీమ మాలల సింహ గర్జన సభకు తరలి రావాలన్నారు. ఎస్‌సి వర్గీకరణ వలన ఎంతో నష్టపోతామని అదే విధంగా క్రిమిలేయర్ పెడితే ఇప్పుడు రిజర్వేషన్ పొంది ఉద్యోగాలు చేస్తున్న వారికి కూడా నష్టం కలుగుతుందన్నారు. మాల మేధావులు, అంబేద్కర్ వాదులు, వివిధ మాల సంఘాల నాయకులు, మాల అనుబంధ సంఘాల నాయకులు విద్యార్థి సంఘాలు, యువజన నాయకులు, పెద్ద ఎత్తున జన సమీకరణ చేసి పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల మాల మహానాడు నాయకులు ఎర్రయ్య, శ్రీరాములు, జయన్న, సుధాకర, జయరాం, చంద్ర నాయకులు పాల్గొన్నారు.

## విద్యా సామగ్రి పంపిణీ

**ప్రజాశక్తి-సుండుపల్లి**

మండలంలో ప్రసిద్ధి గాంచిన బ్రైట్ ట్యూటోరియల్స్‌లో 110 మంది పదవ తరగతి విద్యార్థులకు ట్యూషన్ ఫౌండర్ యాస్మీన్ దాదాపు 10వేలు విలువ గల పరీక్ష సామగ్రి ప్యాడ్స్, పెన్స్, జామెంట్రీ బాక్స్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత సంవత్సరం మా ట్యూషన్‌లో వంద శాతం పిల్లలు ఉత్తీర్ణత సాధించారని అన్నారు. ట్యూషన్‌కు వచ్చిన విద్యార్థినికి మండల ఫస్ట్ ర్యాంకు కూడా వచ్చిందని అన్నారు. ఈ సారి కూడా విద్యార్థులందరూ మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించి తల్లిదండ్రులు, గురువులకు మంచి పేరు తేవాలని, క్రమశిక్షణతో మెలిగి బంగారు భవిష్యత్‌ను నిర్మించుకోవాలని కోరారు. ఈ సంవత్సరం పిల్లలకు వినూత్న పద్ధతులలో కార్పొరేట్ తరహా తరగతులు నిర్వహించి పరీక్షల్లో అందరూ మంచి మార్కులతో ఉత్తీర్ణులయ్యేటట్లు శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. మ్యాథ్స్, ఇంగ్లీష్, సైన్స్‌కు సంబందించి అనుభవం గల ఉపాధ్యాయులతో తరగతులు నిర్వహించి ఆయా సబ్జెక్టుల్లో పిల్లలకు శిక్షణ అందించామని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఇస్మాయిల్ పాల్గొన్నారు.

## సమిష్టి భాగస్వామ్యంతో పి4 సర్వే : ఎంపిడిఒ

**ప్రజాశక్తి-పుల్లంపేట**

మాట్లాడుతున్న ఎంపిడిఒ

పేదరికం లేని సమాజ నిర్మాణమే లక్ష్యంగా సమిష్టి భాగస్వామ్యంతో పి4 సర్వే చేదుతున్నట్లు ఎంపిడిఒ వంప్రసాద్ పేర్కొన్నారు. ఎంపిడిఒ కార్యాలయంలోని సమావేశ మందిరంలో అన్ని సచివాలయాల సిబ్బందితో పి4 సర్వేపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ వరప్రసాద్ మాట్లాడుతూ పేదరికంలేని సమాజ నిర్మాణం లక్ష్యంగా రాష్ట్ర ప్రభు త్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా పబ్లిక్, ప్రయివేట్ పి4 సర్వేకు రూపకల్పన చేసిందని అన్నారు. పేదరికం దూరం చేసేందుకు ప్రభుత్వం ప్రణాళికాయుతంగా చేపడుతున్న కార్యక్రమాలకు అద నంగా సామాజికంగా, ఆర్థికంగా పైన ఉన్న కుటుంబాలు సామాజిక బాధ్యతగా అట్టడుగున ఉన్న కుటుంబాలకు మద్దతుగా నిలిచేలా ప్రోత్సహించడం పి4 లక్ష్యమని అన్నారు. సర్వే ద్వారా సేకరించిన డేటా ఆధారంగా ఇంటి అవ సరాలకు అనుగుణంగా సమర్థవంతమైన ప్రణాళికల రూప కల్పనకు వీల వుతుందని అన్నారు. కుటుంబ వివరాలతో పాటు వివిధ సామాజిక, ఆర్థిక పరి స్థితులు గురించి ఖచ్చితమైన సమాచారాన్ని సిబ్బంది ఇంటింటికి వెళ్లి యాప్‌లో పొందు పరచాల్సి ఉంటుం దని తెలిపారు. ఈ సర్వేలో ఎలాంటి తప్పి దాలకు తావి వ్వొద్దని కుటుం బాలకు ఏవైనా అపోహలు ఉంటే తొలగించి, సర్వే ను త్వరిత గతిన పూర్తి చేయాలని సిబ్బందికి దిశా నిర్దేశం చేయ డం జరిగిం దని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎఒ శ్రీధర్‌రెడ్డి, ఇఒపిఆర్‌డి ముత్తయ్య పాల్గొన్నారు.

## క్రికెట్ అభిమానుల కోసం ఎల్ఇడి స్క్రీన్

**ప్రజాశక్తి-నందలూరు**

ఐసిసి ఛాంపియన్స్ క్రికెట్ ట్రోఫీలో భాగంగా ఆదివారం దుబాయిలో జరుగుతున్న భారత్, న్యూజిలాండ్ మధ్య జరుగుతున్న ఫైనల్ మ్యాచ్ ను క్రికెట్ అభిమానులు తిలకించేందుకు కోసం అరవపల్లి లోని ఆర్ అండ్ బి వద్ద ఎల్ఈడి స్క్రీన్ ఏర్పాటు చేశారు. ఈ స్క్రీన్ ను సర్పంచ్ జంబు సూర్యనారాయణ, మోడపోతుల రాము, ఉప్పు శెట్టి సుధీర్, అరిగే మనీ, అరిగే హరిబాబు ల సహకారంతో ఐకెపిఎస్ నాయకులు పోతురాజు మస్తానయ్య ఈ స్క్రీన్ ను ఏర్పాటు చేశారు. సాయంత్రం విశ్రాంత రైల్వే మెడికల్ ఆఫీసర్ బచ్చు జయ భాస్కరరావు అల్పాహారాన్ని ఏర్పాటు చేశారు. అభిమానులు ఉత్సాహంగా కేరింతలు, చప్పట్లతో మ్యాచ్‌ను తిలకించారు. స్క్రీన్ ఏర్పాటు చేసిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

## అన్నదాన ట్రస్ట్‌కు రూ.18 లక్షలు ఆదాయం

**ప్రజాశక్తి-తంబళ్లపల్లి** : మహాశివరాత్రి ఉత్సవాలకు మల్లయ్య కొండకు వచ్చిన భక్తులకు శ్రీ మల్లికార్జున స్వామి సోషల్ వెల్ఫేర్ అసోసియేషన్ (అన్నదాన ట్రస్ట్) ద్వారా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ప్రజలు చెల్లించిన చందాల ద్వారా రూ.18 లక్షలకు పైగా ఆదాయం వచ్చినట్లు అన్నదాన ట్రస్ట్ అధ్యక్ష కార్యదర్శులు రాజశేఖర్ రెడ్డి, నారాయణరెడ్డి తెలిపారు. ఆదివారం మల్లయ్య కొండ కింద శ్రీ మల్లికార్జున స్వామి సోషల్ వెల్ఫేర్ అసోసియేషన్ భవన్లో కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా భక్తులు చెల్లించిన చందాల ద్వారా రూ.15,9300లు, సరుకులు వేలం పాట ద్వారా వచ్చిన ఆదాయం రూ.2,28,330లు, మొత్తం రూ.18,18,694లు ఆదాయం వచ్చినట్లు తెలిపారు. అన్నదాన నిర్వహణ ఖర్చు రూ.13,05122 పోగా రూ.5,13,572 మిగిలినట్లు తెలిపారు. చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాల మీద పలువురు అభిప్రాయాలు సూచనలు సలహాలు తీసుకున్నారు. ఈ సమావేశంలో వైస్ ఎంపిపి కరీం, బాలకృష్ణారెడ్డి, రమణారెడ్డి, భాస్కర్‌రెడ్డి, రామ్మూర్తి పాల్గొన్నారు.

## గొప్ప పౌరులుగా ఎదగాలి

**ప్రజాశక్తి - వేంపల్లె** : పదో తరగతి విద్యార్థులు పరీక్షలు బాగా రాసి మంచి ఫలితాలు సాధించి భవిష్యత్తులో సమాజానికి ఉపయోగపడే గొప్ప పౌరులుగా ఎదగాలని ఎంఇఒ సిఎస్ జాఫర్ సాదిక్ సూచించారు. స్థానిక ఉషాకిరణ్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎంఇఒ జాఫర్ సాదిక్ మాట్లాడుతూ విద్యార్థి జీవితానికి మార్కులు ఒకటే ప్రామాణికం కాదన్నారు. చదువుతోపాటు జీవితానికి అవ సరమైన జ్ఞానసముపార్జన చేయాలని, తద్వారా సమాజ శ్రేయస్సుకు పాటు పడాలని ఆయన సూచించారు. అనంతరం పాఠశాల వ్యవస్థాపకులు గుజ్జుల కృష్ణారెడ్డి పదో తరగతి విద్యార్థులు పరీక్షలు రాసేటప్పుడు పాటించాల్సిన మెలకువలను తెలిపారు. పాఠశాల కరస్పాండెంట్ బిఎస్ రమణారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేయాలని కోరారు. సమాజాన్ని ప్రభావితం చేసే గొప్ప వ్యక్తులుగా తయారు కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

## గంగమ్మకు ప్రత్యేక పూజలు

**ప్రజాశక్తి - వేంపల్లె** :స్థానిక పెద్ద దేవరగడ్డ వీధిలో వెలసిన గంగమ్మకు ఆదివారం మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు గంగమ్మకు జలాభిషేకం చేసి చలువ ముద్దను ఏర్పాటు చేసి, బోనాలను నైవేద్యంగా పెట్టారు. ప్రతి ఏడాది ఉగాది దగ్గర పడుతున్న సమయంలో గంగమ్మకు చలువ చేయడం ఆనవాయితీగా వస్తోంది.

# వ్యతిరేకంగా పనిచేసేవారిపై చర్యలు

**ప్రజాశక్తి-పీలేరు**

మాల మహానాడు కమిటీకి వ్యతిరేకంగా ఎవరు పనిచేసిన అలాంటి వారిపై చర్యలు తప్పవని మహానాడు రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ యమలా సుదర్శనం తెలిపారు. ఆదివారం పీలేరులో జిల్లా ఉపాధ్యక్షులు జెట్టి మల్లికార్జున ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ మాలమహానాడు కమిటికి వ్యతిరేకంగా ఎవరు ప్రవర్తించినా వారిపై సంఘం తరపున క్రమ శిక్షణా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాయలసీమ మాల విద్యార్థి సంఘం అధ్యక్ష పదవి నుంచి మలతోటి నరేష్‌ను తొలగిస్తూ ప్రకటన చేశారు. గతంలో నరేష్ వైఎస్ఆర్ విద్యార్థి విభాగంలో పనిచేస్తూ భూ దందాలు, అక్రమాలకు పాల్పడ్డాడని, సార్వత్రిక ఎన్నికల తర్వాత రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో తన ఉనికిని కాపాడుకోడానికి మాల మహానాడు కమిటిని ఆశ్రయించగా, కమిటి అతనికి రాయలసీమ విద్యార్థి సంఘం అధ్యక్షులుగా నియ మించింది. కానీ అతనిలో ఎలాంటి మార్పు రాకపోగా, సంఘ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్ప డుతూ సంఘాన్ని గౌరవించకుండా అతని ప్రవర్తన ఉండడంతో, రాష్ట్ర కమిటీ అతనిపై క్రమశిక్షణా చర్యలు తీసుకుంటూ మాల విద్యార్థి సంఘం అధ్యక్ష పదవి నుంచి తొలగించినట్లు తెలిపారు. ఇకపై అతను చేసే ఏ కార్యక్రమాలకు మాలమహానాడు కమిటికి సంబంధం ఉండదని అన్నారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు అరిపెంట లక్ష్మీనారాయణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తుమ్మల ధరణ్‌కుమార్, జిల్లా అధ్యక్షులు చింతపర్తి శివయ్య పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సుదర్శనం

# బాధితులకు ఎమ్మెల్యే ఆర్థిక సాయం

బాధితులకు ఆర్థిక సాయం అందిస్తున్న వైసిపి నాయకులు

**ప్రజాశక్తి-బి.కొత్తకోట**

తంబళ్లపల్లి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి మరోసారి మానవతాన్ని చాటుకున్నారు. పిటిఎం మండలం, సంపతి కోటలో నివాసముంటున్న గంగంపల్లి శివన్న ఇళ్లు అగ్నిప్రమాదంలో కాలి బూడిదై ఆ కుటుంబం సర్వం కోల్పోయింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఇచ్చిన మాట ప్రకారం రూ.50 వేలను స్థానిక నాయకులు చేతుల మీదుగా ఆదివారం ఆ కుటుంబానికి అందించారు. శివన్న కుటుంబ సభ్యులు ఎమ్మె ల్యేకి కృతజ్ఞతలు ఎలిపారు. కార్యక్రమంలో వైసిపి యువ నాయకులు మాచిరెడ్డి ఉమాశంకరరెడ్డి, మాజీ సర్పంచ్ ఎం.రవీంద్రారెడ్డి, అమరనాథ్‌రెడ్డి, కార్గి శివారెడ్డి, ఉపసర్పంచ్ కె.మధుకర్‌రెడ్డి, చలపతి, కానమ్మకలపల్లి శీన, రమణ, సి.శీన, సి.వెంకటరమణ, గోపాల్, మద్దిరెడ్డి, సంపతికోట వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మహిళా రైతులకు ఘనంగా సన్మానం

**ప్రజాశక్తి-పీలేరు**

పీలేరు హెరిటేజ్ ఫుడ్స్ లిమిటెడ్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడు కల్లో భాగంగా ఆదివారం మహిళా రైతులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి హెరిటేజ్ పీలేరు యూనిట్ మేనేజర్ పి.శివశంకరయ్య అధ్యక్షత వహించగా, టెక్నో ప్రాజెక్ట్ మేనేజర్లు రామకృష్ణ, సుబ్రహ్మణ్యం నాయుడు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లోనూ ముందుం టున్నారని అన్నారు. సమాజాభివృద్ధిలోనూ అన్ని రంగాల్లో ప్రముఖ పాత్ర పోషిస్తున్నారని చెప్పారు. నారా భువనేశ్వరి, వైస్ చైర్‌పర్సన్, మేనేజింగ్ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తూ తన శ్రద్ధ, కృషితో హెరిటేజ్ డైరీ అభివృద్ధికి కీలకంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. హెరిటేజ్ పీలేరు మేనేజర్ పి. శివశంకరయ్య మహిళా రైతుల సంక్షేమం సంస్థకు అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశమని అన్నారు.

సన్మానం పొందిన మహిళా రైతులతో హెరిటేజ్ సభ్యులు

# ఎంపిడిఒ కార్యాలయంలో చెట్లు నరికివేత

నరికిన చెట్ల దుంగలు

**ప్రజాశక్తి గాలివీడు**

స్థానిక ప్రభుత్వ కార్యాలయంలో ఆదివారం ఎంపిడిఒ కార్యాలయంలో వెనుకవైపున ఉన్న చెట్లను రంపంతో కోసి చెట్లను కింద పడేశారు. ప్రభుత్వ అధికారులు కార్యాలయంలో లేని సందర్భంలో వాల్టా చట్టాన్ని అతిక్రమించి తహశీల్దార్ అనుమతిగానీ, ఎంపిడిఒ అనుమతి లేకుండానే ప్రహరీ చుట్టూ ఉన్న చెట్లను నరికి వేశారు. అధికారులు లేని సమయంలో ప్రభుత్వ కార్యాలయంలో చెట్లను నరకడం పైన ప్రజలు ఆందోళన వ్యక్తం చేవారు. పట్ట పగలు ప్రభుత్వ కార్యాలయంలో చెట్లను అక్రమంగా చెట్లను నరికి వేస్తుంటే సామాన్య ప్రజలకు ఎక్కడ న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. సోమవారం కార్యాలయానికి వస్తే అధికారులు ఏం చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.

# లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం

**ప్రజాశక్తి-రామాపురం**

పేద ప్రజలకు సేవలందించడంలో లయన్స్ క్లబ్ సేవకు మారుపేరుగా నిలిచిందని డిస్ట్రిక్ట్ గవర్నర్ పిఎంజెఎఫ్ ఎం.గౌతమ్ కొని యాడారు. మండల కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర హైస్కూల్‌లో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ముఖ్యఅతిథిగా హాజరై ప్రారం భించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జోనల్ 12 ప్రో లయన్స్ క్లబ్ ఆఫ్ రాయ చోటి సేవలందించడంలో ముందంజలో ఉందని అన్నారు. కంటి వైద్య శిబిరంతో పాటు ప్రేమా లయంలో వృద్ధులకు దుస్తులు పంపిణీ కార్యక్రమానికి తనను ముఖ్య అతిథిగా పిలవడం సంతోషం గా ఉందన్నారు. ప్రజలు ఇలాంటి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కంటి వైద్య శిబిరానికి వచ్చిన ప్రజలకు దాతలు ఆంజనేయులురెడ్డి మిక్కినేని ప్రసాద్‌నాయుడు చిత్తూరు నివాసి ఎస్‌బిఐ ఆఫీసర్ సుబ్రహ్మణ్యం శెట్టి భోజనం ఏర్పాటు చేయడం సంతోషించదగ్గ విషయమని అన్నారు. ఈ వైద్య శిబిరానికి వందమంది వరకు కంటి సమస్యల పై రాగా వారిలో 27 మందిని కంటిఆపరేషన్ కోసం తిరుపతి అరవింద్ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు, పాఠశాల కరస్పాండెంట్ చంద్రశేఖర్‌రెడ్డి, టిడిపి నాయకులు భాస్కర్‌రెడ్డి, అంజనరెడ్డి, తిరుపతి అరవింద ఆస్పత్రి సిబ్బంది, ప్రేమాలయం సిబ్బంది ప్రజలు పాల్గొన్నారు.

కంటీ పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

## 'పది'తో చక్కటి ప్రణాళిక వేసుకోండి

**- బాలాజీ హైస్కూల్ డైరెక్టర్ బైరెడ్డి రవీంద్రారెడ్డి**

**ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్**

భవిష్యత్తుకు చక్కటి ప్రణాళిక పదవ తరగతి మార్కులతోనే వేసుకోవాల్సి ఉంటుందని బాలాజీ హైస్కూల్ డైరెక్టర్ బైరెడ్డి రవీంద్రారెడ్డి సూచించారు. స్థానిక బాలాజీ హైస్కూల్‌లో ఆదివారం తొమ్మిదవ తరగతి విద్యార్థులు పదవ తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రవీంద్రారెడ్డి మాట్లాడుతూ భయాన్ని వదిలి ప్రతి సబ్జెక్టును ఇష్టపడి చదవాలన్నారు. తల్లిదండ్రుల కోసమో, ఉపాధ్యాయుల కోసం చదవద్దని మీకోసం, మీ భవిష్యత్ కోసం చదవాలన్నారు. గతంలో 590 క్రాస్ చేసిన విద్యార్థికి ఆ సంవత్సరం ఫీజును తిరిగి ఇచ్చామన్నారు. ఈ ఏడాది కూడా టౌన్ ఫస్ట్ వచ్చిన విద్యార్థికి పూర్తిగా ఫీజు వెనక్కి ఇస్తామన్నారు. పదిలో గ్రేడ్‌లో కానీ మార్కులల్లో కానీ మన స్కూల్ విద్యార్థులు సాధించిన తర్వాతనే మిగతా విద్యార్థులు ఉంటారన్నారు. ఎఒ కెవివి ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ఎదిగేకొద్దీ ఒదిగి ఉండాలన్నారు. సమాజంలో విలువలు పాఠశాల స్థాయిలోనే నేర్చుకుంటారని, వాటిని జీవితాంతం పాటించాలన్నారు. మీరు సాధించే ఉత్తమమైన మార్కులు మీ తల్లిదండ్రులను, మమ్మల్ని మాత్రమే సంతృప్తి పరుస్తాయన్నారు. అవి మీ జీవితానికి బాటలు వేస్తాయన్నారు. అనంతరం భరత్‌కుమార్, ప్రధానోపాధ్యాయులు సూర్యమిత్ర, సీనియర్ ఉపాధ్యాయులు ఖాసీం, ప్రిన్సిపల్ శిరీష, పదవ తరగతి ఉపాధ్యాయులు మాట్లాడారు. పాఠశాలలోని విద్యార్థుల నుంచి సమాజ సేవలో భాగస్వాములై 'నేనున్నాను సేవ చేయడానికి' అని మే ఐ హెల్ప్ యు ఫౌండేయన్‌ను స్థాపించి ముందుకు సాగుతున్న ఆ సంస్థ చైర్మన్ మోరె లక్ష్మణ్‌రావుకు రూ.15,000 వితరణ చేశారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. సీనియర్ ఉపాధ్యాయులు సత్యానందం, ప్రసాద్, బాషా పాల్గొన్నారు.

## సమాజ సేవలో విద్యార్థులు భాగస్వామ్యం కావాలి

**ప్రజాశక్తి - వేంపల్లె**

సమాజ సేవలో విద్యార్థులందరూ భాగస్వామ్యం కావాలని ఎన్ఎస్ఎస్ యూనిట్ అధికారి గోన ఇందుమతి పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని నందిపల్లె గ్రామంలో ఇడుపులపాయ ఆర్కేవ్యాలీ ట్రిపుల్ఐటి ఎన్ఎస్ఎస్ యూనిట్-12 విద్యార్థులు సామాజిక అవగాహన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో డిజిటల్ అక్షరాస్యత, పర్యావరణ పరిరక్షణ, నకిలీ ఫోన్ కాల్స్ తదితర సామాజిక సమస్యలపై అవగాహన పెంచడంలో దృష్టి సాధించినట్లు తెలిపారు. ఎన్ఎస్ఎస్ వాలంటీర్లతో ఇంటింటికి వెళ్లి అవగాహన ప్రచారాలు, గ్రామస్తులతో పరస్పర చర్చలు నిర్వహించినట్లు చెప్పారు. స్థిరమైన అభివృద్ధిలో సమాచార సంఘాల పాత్రను నొక్కి చెప్పారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు చేసిన సామాజిక అవగాహన కల్పించడంలో అంకితభావంతో పని చేసినందుకు అభినందించారు. సామాజిక బాధ్యత పట్ల నిబద్ధత గ్రామీణాభివృద్ధికి అర్థవంతంగా సహకరించేలా విద్యార్థులను ఎంతో ప్రోత్సహిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ విద్యా వాలంటీర్లు పాల్గొన్నారు.

## మీదిపెంట్ల కోటను పర్యాటకంగా మార్చాలి

**- పిసిసి అధికార ప్రతినిధి ఎన్.తులసిరెడ్డి**

**ప్రజాశక్తి - వేముల**

స్థానిక మీదిపెంట్ల కోటను పిసిసి అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్.తులసిరెడ్డి ఆదివారం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకటేష్‌తో కలిసి సందర్శించారు. అనంతరం తులసిరెడ్డి మాట్లాడుతూ విజయనగర సామ్రాజ్యంలో పాలేగాళ్ల కోటగా నిర్మించబడిన ఈ మీదిపెంట్ల కోటను ప్రభుత్వం పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలన్నారు. తద్వారా చరిత్రను రాబోయే తరానికి అందించిన వారమవుతామని తెలిపారు. కోటను రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేయడం వల్లే శిథిలావస్థకు చేరిందన్నారు. కూటమి ప్రభుత్వం స్పందించి వెంటనే ఈ ప్రాంతాన్ని ఒక పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని కోరారు. కార్యక్రమంలో వెంకట నారాయణ, ఉత్తన్న, నాగరాజు పాల్గొన్నారు.

## యువతను నమ్మించి మోసగించడం భావ్యమా..!

**వేంపల్లె :** నిరుద్యోగ యువతను నమ్మించి మోసగించడం భావ్యమా అని పిసిసి అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్.తులసిరెడ్డి ముఖ్యమంత్రిని ప్రశ్నించారు. ఆదివారం వేంపల్లిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి కూటమి అధికారంలోకి వచ్చే దానికి ప్రధాన కారణం సూపర్‌సిక్స్ హామీలు అన్నారు. ఇందులో ప్రధానమైన హామీ నిరుద్యోగ భృతి అన్నారు. తాము అధికారంలోకి వస్తే నిరుద్యోగ భృతి కింద నెలకు రూ.3 వేలు ప్రభుత్వం ఇస్తుందని సూపర్ సిక్స్ హామీల్లో పేర్కొన్నారని తెలిపారు. రాష్ట్రంలో దాదాపు రూ 20 లక్షల మంది నిరుద్యోగులున్నారన్నారు. ఏప్రిల్ నుంచి నిరుద్యోగ భృతి అమలు చేయాలని తులసిరెడ్డి డిమాండ్ చేశారు.

# క్రైం కార్నర్

## రెడ్డి కాలనీలో చోరీ

**ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్**

చెల్లా చెదురుగా పడివున్న బీరువాలోని సామగ్రి

పట్టణంలోని రెడ్డికాలనీ ఎక్స్టెన్షన్‌లో ఓ ఇంటిలో దొంగలు చోరీకి పాల్పడ్డారు. బాధితుడు ఒకటో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు మేరకు.. మదనపల్లె పట్టణం, రెడ్డీస్ కాలనీ ఎక్స్టెన్షన్, రాయల్ అపార్ట్‌మెంట్ రోడ్డులోని ఓ అద్దె ఇంటిలో మనోహర్‌రెడ్డి ఆమె తల్లి నివాసం ఉంటున్నారు. మనోహర్‌రెడ్డి తల్లి 15 రోజులక్రితం బందువుల ఇంటికి వెళ్లడంతో ఇంట్లో ఒక్కడే ఉంటు న్నాడు. శనివారం బందువుల ఇంటిలో పుట్టిన రోజు వేడుకలు ఉండడ ంతో మనోహర్ రెడ్డి ఇంటికి తాళం వేసి వెళ్లాడు. రాత్రి అక్కడే ఉండి ఉదయాన్నే ఇంటికి రావడంతో ఒక్కసారిగా షాక్ కు గురయ్యాడు. ఇంటి తలుపు తెరిచి ఉంది. ఇంటిలోని వస్తువులు, బీరువాలోని దుస్తులు చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. బీరువాలో ఉన్న రూ.20 వేలు నగదు, పూజగదిలో రెండు వెండి విగ్రహాలు చోరి అయినట్లు గుర్తించాడు. ఈ మేరకు ఒకటో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## రెండు గ్రూపుల మధ్య ఘర్షణ

**- పది మందికి గాయాలు**

**ప్రజాశక్తి మదనపల్లె అర్బన్**

గ్రామ కంఠం భూమి విషయంలో ఇరు గ్రూపుల వారు ఘర్షణ పడి పరస్పరం దాడి చేసుకుని రాళ్లు రువ్వుకోవడంతో చెందిన పదిమంది గాయపడ్డారు. ఈ సంఘటన ఆదివారం మదనపల్లె రూరల్ మండల పరిధిలో చోటు చేసుకుంది. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మదనపల్లె రూరల్ మండలం, వలసపల్లె పంచాయతీ, బోగ్గిటివారి పల్లెకు గ్రామంలో దళితులు, వాల్మీకి సామాజిక వర్గాలకు చెందిన వారికి గత కొన్నేళ్లుగా గ్రామ కంఠం భూమి విషయమై ఘర్షణ జరుగుతోంది. ఈ క్రమంలో ఎమ్మెల్యే సంఘటన స్థలానికి వెళ్లి రెండు గ్రూపుల వారిని పిలిపించి నాలుగు కుంట్ల స్థలాన్ని చెరో రెండు కుంటల స్థలం కేటాయించారు. ఈ క్రమంలో దళితులకు కేటాయించిన స్థలంలో అంబేద్కర్ విగ్రహం పెట్టాలని నిశ్చయించుకున్నారు. వాల్మీకులకు కేటాయించిన స్థలంలో గంగమ్మ ఆలయాన్ని నిర్మించాలని నిర్ణయించుకున్నారు. ఆదివారం వాల్మీకి సామాజిక వర్గానికి చెందిన కొందరు జెసిబిని తీసుకెళ్లి స్థలాన్ని చదును చేస్తున్నారు. వీరి స్థలం అనుకొని ఉన్న దళితుల కేటాయించిన స్థలంలో అంబేద్కర్ ఫ్లెక్సీ ఉండడంతో దానిని తొలగించాలని తెలిపారు. ఇందుకు దళితులు ససేమిరా ఒప్పుకోలేదు. ఆగ్రహించిన వాల్మీకి సామాజిక వర్గానికి చెందిన శ్రీరాములు, ఆదినారాయణ, వెంకటేష్, శ్రీనివాసులు, నరసింహులు, చల్లప్ప, రవి, హరికృష్ణ దళితులపైకి దాడికి తెగబడ్డారు. దళితులైన వెంకటస్వామి, నారాయణ, కృష్ణవేణి, రత్న మ్మ, రజిత ఎదురుదాడికి దిగారు. రెండు గ్రూపులు రాళ్లు రువ్వుకొని పరస్పర దాడులకు దిగడంతో దళిత వర్గానికి చెందిన వెంకటస్వామి తలకు బలమైన గాయం కావడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఇతనితో పాటు నారాయణ, కృష్ణవేణి, రత్నమ్మ, రజిత గాయపడగా స్థానికులు వీరిని ప్రభు త్వాసుపత్రికి తరలించారు. వాల్మీకి సామాజిక వర్గానికి చెందిన లక్ష్మీనారాయణ, రాజమ్మ, నరసమ్మ, దేవమ్మ, శ్రీనివాసులు స్వల్పంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న రూరల్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని రెండు గ్రూపులవారిని చెదరగొట్టారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ కళా వెంకటరమణ తెలిపారు.

## లారీ, బైక్ ఢీ : యువకుడి మృతి

**ప్రజాశక్తి-పుల్లంపేట**

ప్రమాదానికి గురైన బైక్‌ను పరిశీలిస్తున్న పోలీసులు

ఓబులవారిపల్లి మండల పరిధిలోని జాతీయ హైవే రోడ్డు మంగంపేటలోని బొమ్మవరం క్రాస్ వద్ద ఆదివారం బైక్‌ను లారీ ఢీ కొనడంతో ద్వి చక్ర వాహన దారుడు మృతి చెందాగా మరొక బాలుడుకి తీవ్రంగా గాయాలు అయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పుల్లంపేట మండలం అప్పారాజుపేట పంచాయతీ పెరియవరం దళితవాడకు చెందిన అందే రఘుపతి కుమా రుడు అందే వెంకటేష్(26) కొర్లకుంట వద్ద ఉన్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో చదువుతున్న మేనల్లుడు విజయ్‌ను చూడడానికి రావడం జరిగింది. స్కూల్‌లో అనుమతి తీసుకుని విద్యార్థికి అవసరమైన వస్తువులు కొనేందుకు అనుమతి తీసుకొని బైక్‌పై వెళుతూ జాతీయ హైవే రోడ్ లో మంగంపేట లోని బొమ్మవరం క్రాస్ వద్ద ఎదురుగా వస్తున్న లారీ ఢీకొనడంతో ద్విచక్ర వాహనం నడుపుతున్న వెంకటేష్ అక్కడికక్కడే మృతి చెందడం జరిగింది. వెనుక కూర్చున్న 9వ తరగతి చదువుతున్న విజయ్‌కి గాయాలు కావడంతో 108 ద్వారా రైల్వే కోడూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా వైద్యులు అందుబాటులో లేకపోవడంతో తిరుపతి రుయా కు తరలించారు. ప్రమా దానికి కారణమైన లారీ డ్రైవర్, లారీని వదిలి పరారు అయ్యారు. ఓబులవారిపల్లి ఎస్ఐ మహేష్ నాయుడు ఘటనా స్థలంకి చేరుకొని ట్రాఫిక్ ను పునరుద్ధరించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్ఐ మహేష్ నాయుడు తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో మరో యువకుడి..

**ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్**

రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం చెందాడు. ఈ సంఘటన శనివారం రాత్రి మదనపల్లి రూరల్ మండల పరిధిలో జరిగింది. తాలుకా సిఐ కళా వెంకట్రమణ తెలిపిన వివరాల మేరకు.. మదనపల్లె పట్టణం, ఇండస్ట్రియల్ ఎస్టేట్ ప్రాంతానికి చెందిన శ్రీనివాసులు కుమారుడు ఉదయ్(20) ద్విచక్ర వాహనంలో పుంగనూరు రోడ్లో వెళ్తుండగా అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఉదయ్ ని స్థానికులు గుర్తించి 108 లో మదనపల్లె జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అతను అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి తర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు.

## లారీ కిందపడి వ్యక్తికి తీవ్ర గాయాలు

**ప్రజాశక్తి-పుల్లంపేట**

మండల పరిధిలోని పుత్తనవారిపల్లె చెక్ పోస్ట్ వద్ద ఆదివారం రాత్రి లారీ కిందపడి గౌరి అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసుల వివరాల ప్రకారం ఓబులవారిపల్లె మండలం అయ్యలరాజుపల్లె గ్రామానికి చెందిన గౌరి అనే వ్యక్తి తమలపాకుల లారీలో కూలిగాపని చేస్తు న్నాడు. పుత్తనవారిపల్లె చెక్ పోస్ట్ వద్ద ఆగి చలానా కట్టి తిరిగి వెళుతుండగా క్యాబిన్‌లో ఉన్న గౌరీ అనే వ్యక్తి టాప్ పైకి ఎక్కుతూ జారి కిందపడ్డాడు. కాళ్లపై లారి వెనక టైర్లు ఎక్కడంతో రెండు కాళ్లు నుజ్జునుజ్జు అయ్యి తీవ్రంగా గాయపడ్డాడు. తీవ్ర రక్త స్రావంతో గాయపడిన బాధితుడిని పోలీసుల సాయంతో 108 లో రాజంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

## పలు కార్యక్రమాల్లో ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి

**ప్రజాశక్తి - తొండూరు** : మండలంలోని ఇనగలూరు గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు ఈశ్వర్‌రెడ్డి ఆహ్వానం మేరకు ఆదివారం పిల్లల కేశ ఖండన కార్యక్రమానికి ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి విచ్చే శారు. ఈ సంద ర్భంగా టిడిపి కార్య కర్తలతో పలు అంశా లపై చర్చిం చారు. తెలుగుదేశం నాయ కులు కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. అనంతరం గ్రామా నికి చెందిన తెలుగుదేశం పార్టీ యువ నాయకులు, నూతన వధూవరులైన విశ్వనాథ్‌రెడ్డిని, ఆయన భార్యను ఆశీర్వదించి నారు. పార్టీలో జరుగుతున్న విషయాలపై మండలంలోని సీనియర్ నేతలతో చేర్చించారు. కార్యక్రమంలో సైదాపురం నరసింహారెడ్డి, తొండూరు రమణారెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.